

కొత్తగూడెంలో ఇంటిమీద కూలిన విద్యుత్ స్తంభం

# అకాల నష్టం.. రూ.కోటి

- భద్రాద్రి జిల్లాలో బీభత్సం సృష్టించిన గాలివాన
- నేలకొరిగిన 278 విద్యుత్ స్తంభాలు, 48 ట్రాన్స్‌ఫార్మర్లు
- నేలవాలిన వరి, రాలిపోయిన మామిడి, జీడిమామిడి, కొబ్బరి బొండాలు
- పునరుద్ధరణ పనుల్లో నిమగ్నమైన విద్యుత్ శాఖ అధికారులు
- రాత్రంతా అంధకారంలోనే మగ్గిన ప్రజలు



భద్రాద్రి కొత్తగూడెం : ఆదివారం రాత్రి వచ్చిన గాలిదుమారానికి నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 22 (నమస్తే తెలంగాణ) : గాలిదుమారం జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలను అతలాకుతలం చేసింది. రెండు గంటల పాటు బీభత్సం సృష్టించి దాదాపు రూ.కోటి మేర నష్టాన్ని మిగిల్చింది. ఇళ్లపై రేకులు, పైకప్పులను కుప్ప చేసి మొండి గోడలను మిగిల్చింది. విద్యుత్ స్తంభాలు, టాన్స్‌ఫార్మర్లు, భారీ హోర్డింగ్‌లను నేలమట్టం చేసింది. కోతకొచ్చిన వరి పంటను, మామిడి, జీడిమామిడి, కొబ్బరి తోటల్లోని కాయలను నేలపాలు చేసింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఇల్లెందు, కొత్తగూడెం, అశ్వారావుపేట, పినపాక నియోజకవర్గాల్లో వీచిన ఈదురు గాలులు, వర్షానికి స్తంభాలు నేలకూలడంతో ఆదివారం రాత్రంతా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో ప్రజలు దోమల మోత, ఉక్కపోతతో రాత్రంతా ఉక్కిరి బిక్కిరయ్యారు. సోమవారం కూడా ప్రధాన పట్టణాల్లో మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా లేకపోవడంతో నానా అవస్థలు పడ్డారు. విద్యుత్ శాఖ అధికారులు ఆదివారం రాత్రి నుంచి మరమ్మతులతోపాటు యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ పనులు చేపట్టినా తెల్లవారు జాము వరకు ఒక ఫీడర్‌కు కరెంటు ఇవ్వగలిగారు. పనులు పూర్తికాని ప్రాంతాల్లో ప్రజలు అంధకారంలోనే మగ్గిపోయారు.



కొత్తగూడెంలో కూలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్



లక్ష్మీదేవిపల్లిలో నేలకొరిగిన విద్యుత్ స్తంభం

### రైతులకు మళ్లీ నష్టమే..

ఒక వైపు ఈదురు గాలులు.. మరో వైపు అకాల వర్షానికి రైతులు మళ్లీ పంటలు నష్టపోవాల్సి వచ్చింది. జిల్లా వ్యాప్తంగా 9 మండలాల్లోని 21 గ్రామాల్లో 285 మంది రైతులకు చెందిన 676 ఎకరాల్లో పంటలకు నష్టం జరిగింది. యాసంగిలో సాగు చేసిన పంటలకు మొన్నటి వరకు సాగు నీరు అందకపోవడంతో నానా అవస్థలు పడ్డారు. ప్రస్తుతం అకాల వర్షానికి ఎంతో కొంత చేతికొచ్చిన పంటలను కోల్పోవాల్సి వచ్చింది. దీనిపై ఇప్పటికే వ్యవసాయ శాఖ అంచనాలను సిద్ధం చేసింది.

### విద్యుత్ శాఖకు భారీ నష్టం

గాలివాన బీభత్సానికి విద్యుత్ శాఖకు రూ.68 లక్షల మేర నష్టం వాటిల్లింది. జిల్లావ్యాప్తంగా 278 విద్యుత్ స్తంభాలు ఇళ్లు, రోడ్లపై పడిపోయాయంటే గాలి తీవ్రత ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. అంతేకాక 48 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు నేలమట్టం కావడంతో ఆ శాఖ అధికారులు ఆగమేఘాలపై పునరుద్ధరణ పనులు చేపట్టారు. ఈ వివరాలను విద్యుత్ శాఖ ఎస్ఈ రమేశ్ వెల్లడించారు. మరోవైపు ఏళ్లనాటి భారీ వృక్షాలు సైతం నేలమట్టమయ్యాయి. ఇల్లెందు-కొత్తగూడెం ప్రధాన రహదారిపై భారీ వృక్షాలు కూలిపోవడంతో రాకపోకలకు కొద్దిసేపు అంతరాయం ఏర్పడింది. గాలి దుమారం తీవ్రతపై కలెక్టర్ ప్రియాంక ఆల వెంటనే జిల్లా అధికారులను అప్రమత్తం చేశారు. రోడ్డుపై అడ్డంగా పడిపోయిన చెట్లను తొలగించాలని ఆదేశించారు. గాలికి విరిగిపడిన చెట్లు, వ్యర్థాలు ఎక్కడా లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.





కొత్తగూడెంలో రోడ్డుపై కూలిన భారీ వృక్షాలు

## ఖమ్మం జిల్లాలో 185 ఎకరాల్లో పంటనష్టం

### ఒక్క మండలంలోనే పంటలు దెబ్బతిన్నట్లు అధికారుల నివేదిక

ఖమ్మం వ్యవసాయం, ఏప్రిల్ 22: ఈ నెల 21న కురిసిన అకాల వర్షం, రాళ్లవానకు ఖమ్మం జిల్లాలోని కేవలం సింగరేణి మండలంలో 102 మంది రైతులకు సంబంధించి 185.20 ఎకరాల్లో మాత్రమే పంటల నష్టం జరిగినట్లు జిల్లా వ్యవసాయశాఖ ప్రాథమిక నివేదిక సిద్ధం చేసింది. ఈ మేరకు జిల్లా వ్యవసాయశాఖ నుంచి సోమవారం ఒక ప్రటన విడుదల చేశారు. వ్యవసాయశాఖ గణాంకాల ప్రకారం సింగరేణి మండలంలో 102 మంది రైతులకు సంబంధించి 185.20 ఎకరాల్లో పంట నష్టం జరిగింది. ఇందులో 35 మంది రైతులకు సంబంధించిన 48 ఎకరాల్లో వరి, 60 మంది రైతులకు సంబంధించిన 83.20 ఎకరాల్లో మొక్కజొన్న, ఏడుగురు రైతులకు సంబంధించిన 54 ఎకరాల్లో ఉద్యాన పంటలకు నష్టం జరిగింది. సింగరేణి మండలంలో కూడా 8 గ్రామాల్లోని పంటలకు మాత్రమే నష్టం జరిగినట్లు అధికారులు ఆ నివేదికలో పొందుర్చారు.

# కాంగ్రెస్‌వి మోసపూరిత హామీలు

- ఈ లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీకి కర్రుకాల్చి వాతపెట్టాలి
- బీఆర్ఎస్ ఖమ్మం రూరల్ సమావేశంలో ఎంపీ నామా
- బీఆర్ఎస్‌కు మెజార్టీ సీట్లు ఖాయం: ఎంపీ వద్దిరాజు
- అభ్యర్థి లేక కాంగ్రెస్ కకావికలం: ఎమ్మెల్సీ తాతా మధు
- పాలేరే ఎప్పటికీ నా కుటుంబం : మాజీ ఎమ్మెల్యే కందాళ



మాట్లాడుతున్న ఖమ్మం బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు, చిత్రంలో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి

ఖమ్మం రూరల్, ఏప్రిల్ 22: ప్రజలను అయోమయానికి గురిచేసి.. మోసపూరిత హామీలను గుప్పించడం వల్లనే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని ఖమ్మం ఎంపీ, బీఆర్ఎస్ ఖమ్మం పార్లమెంటు నియోజకవర్గ అభ్యర్థి నామా నాగేశ్వరరావు విమర్శించారు. హామీలను అమలు చేయని ఆ పార్టీకి ఈ లోక్‌సభ ఎన్నికల్లో కర్రుకాల్చి వాతపెట్టాల్సిన అవసరం ఏర్పడిందని అన్నారు. మండలంలోని పోలేపల్లిలో ఉన్న ఓ ఫంక్షన్ హాల్లో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బెల్లం వేణుగోపాల్ అధ్యక్షతన సోమవారం జరిగిన ఆ పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాకముందు, తెలంగాణ వచ్చిన తరువాత పాలేరు నియోజకవర్గం ఎంతలా అభివృద్ధి చెందిందో ప్రజలందరికీ తెలుసునని అన్నారు. రైతుబంధుకు రాంరాం చెబుతున్న ఈ కొత్త ప్రభుత్వం.. భవిష్యత్తులో రైతు సంక్షేమ పథకాలను కూడా తుంగలో తొక్కే ప్రమాదం కన్పిస్తోందని అన్నారు. తెలంగాణ ఆత్మగౌరవం నిలబడాలన్నా, మునుపటి అభివృద్ధి, సంక్షేమం కావాలన్నా ఈ పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ తప్పకుండా గెలవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు జీవన్‌కుమార్, యండపల్లి వరప్రసాద్, బెల్లం ఉమ, దర్గయ్య, పేరం వెంకటేశ్వర్లు, లక్ష్మణ్‌నాయక్, బద్దె నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

### బీఆర్ఎస్‌కు మెజార్టీ సీట్లు ఖాయం: రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు

ఈ లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు మెజార్టీ సీట్లు ఖాయమని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఖమ్మం అభ్యర్థి నామా నాగేశ్వరరావు గడిచిన నెల రోజులుగా ఏ గ్రామానికి వెళ్లినా జనం నీరాజనం పలుకుతున్నారని అన్నారు. అన్ని వర్గాల మద్దతూ బీఆర్ఎస్‌కే ఉందని అన్నారు. దీంతో కాంగ్రెస్‌కు దిక్కు తోచడం లేదని, దీంతో సోనియాగాంధీ నుంచి మొదలుకొని రోజుకొకరి పేరును తెరపైకి తెస్తోందని విమర్శించారు. ఈ మండలంలో నామాకు మరోసారి తిరుగులేని మెజార్టీ అందించాలని పిలుపునిచ్చారు.

### అభ్యర్థులు లేక కాంగ్రెస్ కకావికలం.. : తాతా మధు, ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు

'అంతన్నడు ఇంతన్నాడే..' అన్నట్లుగా ప్రస్తుతం కాంగ్రెస్ పరిస్థితి ఉందని ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధు విమర్శించారు. బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావును ఎదుర్కొనే సత్తా కలిగిన అభ్యర్థి లేక కాంగ్రెస్ పార్టీ కిందామీదా పడుతోందని ఆరోపించారు. దీనికి తోడు ప్రజల వద్దకు, రైతుల వద్దకు వెళ్లేందుకు ఆ పార్టీ నాయకులు వణుకుతున్నారని విమర్శించారు. కేసీఆర్ చేసిన మంచి పనులను తలుచుకుంటూ ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు పట్టం కట్టేందుకు ప్రజలు ఎదురుచూస్తున్నారని స్పష్టం చేశారు.. దీంతో ప్రజల మద్దతు కూడగట్టలేక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై కాంగ్రెస్ నాయకులు అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారని విమర్శించారు.

### ఎప్పటికీ పాలేరే నా కుటుంబం : కందాళ ఉపేందర్‌రెడ్డి, పాలేరు మాజీ ఎమ్మెల్యే

పాలేరు నియోజకవర్గం ఎప్పటికీ తన కుటుంబమేనని మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి అన్నారు. పాలేరు నియోజకవర్గ ప్రజలకు, తనకు విడదీయలేని అనుబంధం ఉందని అన్నారు. గత ఓటమిని బాధ్యతగా తీసుకొని రెట్టింపు ఉత్సాహంతో పని చేద్దామని, ఈ పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావుకు ఇక్కడి నుంచి అఖండ మెజార్టీని అందిద్దామని పిలుపునిచ్చారు.

# మరమ్మతు పనులన్నీ పూర్తి చేయాలి

- భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక ఆల
- అమ్మ ఆదర్శ పాఠశాల పథకంపై సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక ఆల

భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 22 (నమస్తే తెలంగాణ) : అమ్మ ఆదర్శ పాఠశాలల పథకం కింద ఎంపికైన జిల్లాలోని అన్ని పాఠశాలల్లో మరమ్మతు పనులన్నీ పూర్తి చేయాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల అధికారులను ఆదేశించారు. కొత్తగా ఏర్పడిన అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలు పనులు చేయించే విధానంపై సోమవారం ఐడీవోసీ సమావేశ మందిరంలో డీఆర్‌డీవో విద్యాచందనతో కలిసి నీటిపారుదల, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, మున్సిపల్, పీఎస్ ఈడబ్ల్యూఐడీసీ, ఈఈలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 643 పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా మంజూరైన పనులన్నింటినీ మంగళవారం నుంచి ప్రారంభించి మే నెలాఖరుకల్లా పూర్తి చేయడానికి అన్ని శాఖల సమన్వయంతో ప్రణాళికలు సమర్పించాలన్నారు. తాగునీరు, తరగతి గదుల్లో మరమ్మతులు, టాయిలెట్లు, విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు తదితర అంశాలను గుర్తించి పనులు పూర్తి చేయించాలన్నారు. ప్రతి పంచాయతీలో 200 మందికి తగ్గకుండా ఉపాధిహామీ పనులు చేపట్టాలని, తాగునీటి సరఫరాను ప్రతిరోజు పరిశీలించాలన్నారు. ప్రతి ఇంటికి నీటి సరఫరా జరగాలని ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత అధికారులను ఆదేశించారు. వీసీలో పీఆర్ ఈఈ శ్రీనివాస్, ఆర్అండ్‌బీ ఈఈ వెంకటేశ్వర్లు, డీఈవో వెంకటేశ్వరచారి, ఆర్అండ్‌బీ డీఈ నాగేశ్వరరావు, మున్సిపల్ డీఈ రవికుమార్, ట్రైబల్ వెల్ఫేర్ డీఈ రమేశ్‌కుమార్, డీపీఎం సెర్ప్ నాగజ్యోతి, రంగారావు, ఎంపీడీవోలు, ఎంఈవోలు, డీఈలు, ఏఈలు, ఏపీఎంలు, వీవో అధ్యక్షులు పాల్గొన్నారు.

# రాములోరికి వసంతోత్సవం

### నేటితో ముగియనున్న బ్రహ్మోత్సవాలు



వసంతాన్ని కలుపుతున్న అర్చకులు

భద్రాచలం, ఏప్రిల్ 22 : వసంత పక్ష ప్రయుక్త శ్రీరామ నవమి తిరు కల్యాణ నవాహ్నిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా భద్రాచలం రామాలయంలో ధ్వజారోహణం తర్వాత(8వ రోజు సందర్భంగా) నూతన దంపతులైన రామయ్య తండ్రికి, సీతమ్మ తల్లికి సోమవారం వసంతోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. ఉదయం బేడా మండపంలో జలద్రోణి ఉత్సవం చేపట్టారు. అర్చకుల వేద మంత్రోచ్చారణల నడుమ సీతమ్మను, రామయ్యను ఎదురెదురుగా కూర్చోబెట్టి పంచామృతాలతో అభిషేకం చేశారు. తర్వాత ఒక కలశంలో వసంతున్ని ఆవాహనం చేసి బుక్కా గులాల్, అత్తరు, పన్నీరు తదితర సుగంధ ద్రవ్యాలను వేసి మూలవరుల వద్ద స్వామివారి అనుజ్ఞ తీసుకొని బేడా మండపానికి వచ్చి ముందుగా విశ్వక్సేన ఆరాధన, కర్మణ పుణ్యాహవాచన జరిపారు. స్వామివారి, అమ్మవారి శిరస్సుపై పసుపు ముద్దలను ఉంచి అభిషేకం చేసిన తర్వాత మహాకుంభంలోని వసంతాన్ని అంతరాలయంలోని మూలవరుల శిరస్సుపై చల్లారు. మళ్లీ బేడా మండపానికి తీసుకొచ్చి అర్చకులు, ఆలయ సిబ్బంది, మతపర సిబ్బందిపై, భక్తులపై ప్రోక్షణ చేశారు. ఆ తర్వాత స్వామివారిని చలువ చప్పరం వాహనంపై ఆసీనులను చేసి తాతగుడి సెంటర్, ముదిరాజ్ బజార్, పాత ఎల్ఎఫ్ స్కూల్ మీదుగా అంబాసత్రం, బ్రాహ్మణ వీధి గుండా తిరువీధి సేవ జరిపారు. రాత్రికి స్వామివారికి సింహప్రభ వాహనంపై తిరువీధి సేవ నిర్వహించారు.

**నేటితో ముగియనున్న బ్రహ్మోత్సవాలు**

నవాహ్నిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారికి మంగళవారం చక్రతీర్థం నిర్వహించనున్నారు. సాయంత్రం పూర్ణాహుతి, ధ్వజారోహణం, ద్వాదశ ప్రదక్షిణలు చేపట్టనున్నారు. దీంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తం కానున్నాయి. బుధవారం నుంచి స్వామివారికి నిత్య కల్యాణాలు, ఆర్జిత సేవలు ప్రారంభం కానున్నాయని, భక్తులు గమనించాలని దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి తెలిపారు.

# పార్లమెంట్ ఎన్నికలు సజావుగా జరగాలి

- అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, భూపాలపల్లి జిల్లాల పోలీసు అధికారులతో డీజీపీ రవిగుప్తా




ఐటీసీ అతిథిగృహంలో సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న డీజీపీ రవిగుప్తా

సారపాక, ఏప్రిల్ 22 : పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పొరుగు రాష్ట్రాల సరిహద్దు అధికారులతో సమన్వయం పాటిస్తూ పటిష్ఠ చర్యలు చేపట్టాలని రాష్ట్ర డీజీపీ రవిగుప్తా అన్నారు. సోమవారం ఆయన భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, భూపాలపల్లి జిల్లాల పోలీసు అధికారులతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సారపాకలోని ఐటీసీ గెస్ట్‌హౌస్‌లో సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. తొలుత ఆయన హైదరాబాద్ నుంచి హెలీకాప్టర్‌లో చర్ల మండలం చెన్నాపురం, పూసుగుప్ప, ఉంజుపల్లిలో పోలీసు భద్రతా బలగాల క్యాంప్‌లను సందర్శించి అక్కడ పనిచేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బందికి పలు జాగ్రత్తలు, సూచనలు చేశారు. అనంతరం ఐటీసీ గెస్ట్‌హౌస్‌కు హెలీకాప్టర్‌లో చేరుకోగా ముందుగా పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఐటీసీ గెస్ట్‌హౌస్‌లో అధికారులతో మాట్లాడుతూ నిషేధిత సీపీఐ మావోయిస్టు కదలికలపై ఎప్పటికప్పుడు సమాచారం సేకరిస్తూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏజెన్సీ ప్రాంత అభివృద్ధిని అడ్డుకుని అభివృద్ధి నిరోధకులుగా మారిన మావోయిస్టుల వల్ల పార్లమెంట్ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. అంతర్ రాష్ట్ర చెక్‌పోస్టుల వద్ద పనిచేస్తున్న అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ అక్రమ నగదు, మద్యం రవాణాను అడ్డుకోవాలని సూచించారు. మావోయిస్టు ప్రభావిత పోలింగ్ కేంద్రాల్లో పటిష్ఠమైన బందోబస్తు ఏర్పాటు చేసుకుని సమన్వయంతో అధికారులు పనిచేయాలన్నారు. అనంతరం భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామివారిని దర్శించుకున్నారు. ఆయన వెంట అడిషనల్ డీజీపీ ఇంటెలిజెన్స్ శ్రీధర్‌రెడ్డి, గ్రేహౌండ్స్ అడిషనల్ డీజీ విజయ్‌కుమార్, సీఆర్‌పీఎఫ్ సౌత్ జోన్ అడిషనల్ డీజీపీ రవిదీప్‌సింగ్ సాహీ, సీఆర్‌పీఎఫ్ సౌత్ సెక్టార్ హైదరాబాద్ జోన్ ఐజీపీ చారుసిన్హా, ఎస్ఐజీపీ సుమతి ఉన్నారు. సమావేశంలో భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ రోహిత్ రాజ్, ములుగు ఎస్పీ శబరీష్, భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ప్రభాకర్ ఖరే, ఎస్ఐబీ ఎస్పీ రాజేష్, కొత్తగూడెం ఓఎస్‌డీ సాయిమనోహర్, భద్రాచలం ఏఎస్పీ పారితోశ్ పంకజ్, ఏటూరునాగారం ఏఎస్పీ మహేష్ జితే, ట్రైనీ ఐపీఎస్ విక్రాంత్‌సింగ్, సీఆర్‌పీఎఫ్ అధికారులు ఆర్‌కె.పాండా, ఎంకె.మీనా, మోహన్, రితేష్‌కుమార్, డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

# ఖమ్మంలో నాలుగో రోజు 11 నామినేషన్లు



ఖమ్మం కలెక్టర్‌కు నామినేషన్ పత్రాలు సమర్పిస్తున్న అభ్యర్థి



మహబూబాబాద్ ఆర్‌వోకు నామినేషన్ పత్రాలు అందిస్తున్న బీజేపీ అభ్యర్థి

మామిళ్లగూడెం, ఏప్రిల్ 22: ఖమ్మం పార్లమెంటు నియోజకవర్గంలో నాలుగో రోజు సోమవారం నాడు 11 నామినేషన్లు స్వీకరించినట్లు రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గానికి స్వతంత్ర అభ్యర్థిగా దండా లింగయ్య 3 సెట్లు, తేజావత్ జోగురాము స్వతంత్ర అభ్యర్థిగా 2 సెట్లు, అంతోని సురేశ్ బహుజన లెఫ్ట్ పార్టీ అభ్యర్థిగా ఒక సెట్, ఎదురుగట్ల చిట్టిమల్లు స్వతంత్ర అభ్యర్థిగా ఒక సెట్, ఉల్లెంగుల యాదయ్య ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ నుంచి ఒక సెట్, స్వతంత్ర అభ్యర్థిగా మరొక సెట్, మద్దిశెట్టి ఎర్రప్ప స్వతంత్ర అభ్యర్థిగా ఒక సెట్, మద్దినేని అనిల్‌కుమార్ స్వతంత్ర అభ్యర్థిగా ఒక సెట్ నామినేషన్ పత్రాలు దాఖలు దాఖలు చేసినట్లు వెల్లడించారు. మొత్తంగా నాలుగు రోజుల్లో 15 నామినేషన్లు వచ్చినట్లు తెలిపారు. కాగా, నామినేషన్ల దాఖలుకు మరో రెండు రోజులు గడువు ఉంది. ఈ చివరి రోజుల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసే అవకాశం ఉంది.

### 'మహబూబాబాద్' స్థానానికి మరో మూడు..

మహబూబాబాద్, ఏప్రిల్ 22: మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి మరో మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. బీజేపీ అభ్యర్థి అజ్మీరా సీతారాంనాయక్, యూసీసీఆర్ఐఎంఎల్ పార్టీ అభ్యర్థిగా పగిడి ఎర్రయ్య, స్వతంత్ర అభ్యర్థిగా మైపతి అరుణ్‌కుమార్ సోమవారం మహబూబాబాద్ కలెక్టరేట్ రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఆర్‌వో, కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్‌కు తమ నామపత్రాలను అందించారు. అదే విధంగా పాల్వంచ దుర్గ అనే స్వతంత్ర అభ్యర్థి మరోమారు రెండు సెట్ల నామినేషన్ పత్రాలు అందించారు. కాగా, ఈ స్థానానికి ఇప్పటి వరకు వివిధ పార్టీల అభ్యర్థులుగా, స్వతంత్ర అభ్యర్థులుగా మొత్తం ఏడుగురు నామినేషన్లు దాఖలు చేశారు.

# ఇది ముమ్మాటికీ కాంగ్రెస్ తెచ్చిన కరువే..

- పంటల మద్దతు ధరకు ప్రత్యేక కృషి చేశా.. మున్ముందు పోరాడుతా..
- ఖమ్మం ఏఎంసీ రైతులు, కార్మికులతో బీఆర్ఎస్ అభ్యర్థి నాగేశ్వరరావు



ఖమ్మం ఏఎంసీలో రైతులు, కార్మికులతో మాట్లాడుతూ వారి సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎంపీ నామా నాగేశ్వరరావు

ఖమ్మం వ్యవసాయం, ఏప్రిల్ 22 : ఇది కాలం తెచ్చిన కరువు కాదని.. ముమ్మాటికీ కాంగ్రెస్ తెచ్చిన కరువేనని ఖమ్మం ఎంపీ, బీఆర్ఎస్ ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి నామా నాగేశ్వరరావు స్పష్టం చేశారు. రైతులు పండించిన పంటలకు మద్దతు ధర కల్పించేందుకు కృషిచేశానని, ఇందుకోసం ఈ రెండు దఫాల్లో పార్లమెంట్‌లో గట్టిగా కొట్లాడానని, భవిష్యత్‌లోనూ ఇందుకోసం రైతుల పక్షాన పోరాడుతానని తేల్చిచెప్పారు. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌ను సోమవారం సందర్శించిన ఆయన.. పత్తి, మిర్చియార్డుల్లో విస్తృతంగా పర్యటించారు. రైతులు, కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వామినాథన్ కమిషనర్ సిఫార్సులను అమలు చేయాలని, రైతులకు మద్దతు ధర అందించాలని పార్లమెంట్‌లో అలుపెరగని పోరాటం చేశామని అన్నారు. అయినప్పటికీ డాక్టర్ స్వామినాథన్ సిఫార్సులను అమలు చేయకుండా కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరి అవలంబిస్తోందని విమర్శించారు. రైతుల సమస్యలపై కాంగ్రెస్, బీజేపీలు మాట్లాడడం లేదని, ఈ రెండు రైతు వ్యతిరేక పార్టీలేనని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ గెలిస్తేనే రైతులకు న్యాయం జరుగుతుందని స్పష్టం చేశారు. అందుకు ఈ పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థినైన తనను గెలిపించాలని కోరారు. ఏఎంసీ మాజీ చైర్‌పర్సన్ దోరేపల్లి శ్వేత, వర్తక సంఘం బాధ్యులు చిన్ని కృష్ణారావు, మెంతుల శ్రీశైలం, మాటేటి నాగేశ్వరరావు, ఎడ్లపల్లి సతీశ్, జీవై నరేశ్, కోలేటి నవీన్, వాసు, తాళ్లూరి శ్రీనివాస్, చీకటి రాంబాబు, కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ భద్రతా నిబంధనలు పాటించాలి

### 'తల్లాడ' ఘటనపై స్పందించిన ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి

మామిళ్లగూడెం, ఏప్రిల్ 22: తెలంగాణ ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ (టీఎస్ఎన్‌పీడీసీఎల్) పరిధిలో ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా విద్యుత్ భద్రతా నిబంధనలు పాటించాలని సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో సూచించారు. పని చేసే ప్రదేశంలో సేఫ్టీ గ్లౌజ్‌లు, హెల్మెట్ విధిగా ధరించాలని ఆదేశించారు. ఒకవేళ ధరించకుండా నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఖమ్మం జిల్లాలోని సత్తుపల్లి డివిజన్ తల్లాడ సబ్‌స్టేషన్‌లో ఆదివారం ప్రమాదవశాత్తు సిటీ బ్లాస్ట్ పేలడంపై స్పందించారు. భద్రతా నియమాలు పాటించకపోతే విలువైన ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకని ప్రతి ఒక్కరూ విధిగా విద్యుత్ భద్రతా నియమాలు పాటించి, తమ విలువైన ప్రాణాలను కాపాడుకోవాలని కోరారు. తల్లాడ సబ్ స్టేషన్‌లో అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ (ప్రొటెక్షన్) సమక్షంలో లైన్‌మెన్ సిటీ వివరాలు నమోదు చేసేందుకు ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లినప్పుడు భద్రతా నియమాలు పాటించాలని చెప్పకపోవడం వల్ల ఈ ప్రమాదం జరిగినందుకు సంబంధిత ఏడీఈపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించాలన్న సంకల్పంతో విధిగా భద్రతా జాగ్రత్తలు పాటిస్తూ పని చేయాలని సూచించారు. అలాగే, ఉద్యోగులు తమ కుటుంబానికి భరోసాగా ఉండాలని కోరారు.